క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలసిన దుర్గారావు



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గంగాలమ్మ చిత్రపటాన్ని అందిస్తున్న దుర్గారావు

కోరుకొండ: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు కలిశారు. ఈ సందర్భంగా గ్రామ దేవత గంగాలమ్మ వారి చిత్రపటాన్ని జగన్‌కు అందజేశారు. దుర్గారావు వెంట బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాచగొల్ల రమేష్ ఉన్నారు.

జవాన్ శ్రీనివాస్‌కు నివాళి



కోటికేశవరంలో జవాన్ శ్రీనివాస్ స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

కోరుకొండ: కోటికేశవరం గ్రామానికి చెందిన జవాన్ పెబ్బులి శ్రీనివాస్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముడే సింధూదివ్య మాట్లాడుతూ యువత దేశ రక్షణ కోసం సైనిక దళంలో చేరడానికి ముందుకు రావాలన్నారు. జవాన్‌గా వెళ్లిన శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందడం విచారకరమన్నారు. గ్రామం నుంచి ఏడుగురు జవాన్లు సైనిక దళంలోకి వెళ్లడం స్ఫూర్తిదాయకమన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ కొమ్మనాపల్లి గంగరాజు, మాజీ సర్పంచ్ గుడాల పెద్ద చిన్నయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నూలు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జైలుశిక్ష అనుభవించిన వారికి సత్కారాలు

రాజానగరం: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పాలనలో 1975 జూన్‌లో విధించిన ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష అనుభవించిన జిల్లాకు చెందిన మహాంకాళి రామకృష్ణ, ఓలేటి సత్యనారాయణ, నందూరి పార్థసారథి, సీత వెంకటేశ్వర్లు, నలమాటి లక్ష్మీపతి, కనకరాల కోటేశ్వరరావు, పట్టాభి రామయ్యలను ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర అధ్యక్షతన స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో 'నాటి ఎమర్జెన్సీ పరిస్థితులపై అవగాహన' కార్యక్రమం బుధవారం జరిగింది. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యవర్గ ప్రముఖ్ ఓలేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

కడియం: గుడిలోని హుండీ చోరీ చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశామని కడియం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. గత నెల 31న కడియం పోస్టాఫీస్ వీధిలోని శ్రీలక్ష్మీగణపతి గుడిలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదు చోరీ చేశారని ఆలయ కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కడియం ఎస్సై నాగ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజమహేంద్రవరం ఆల్కాట్‌తోట ప్రాంతానికి చెందిన కసినికోట బాల పోసిగణేష్ (పోసి), ఐఎల్‌టీడీ జంక్షన్ ప్రాంతానికి చెందిన బాలుడు (15)ను అరెస్టు చేశారు. నిందితులను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్సై నాగదుర్గాప్రసాద్, స్టేషన్ రైటర్ సురేష్ బాబు, క్రైం కానిస్టేబుల్ ఎ.రవికుమార్‌లను సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ అభినందించారు.

ప్రభా ప్రసాద్‌కు ఏపీజే కలాం అవార్డు



ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు అందుకుంటున్న ప్రభాప్రసాద్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కొంతకాలంగా రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ఎందరికో స్ఫూర్తినిస్తున్న కొమ్మిరెడ్డి ప్రభావతి ప్రసాద్‌కు వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును బుధవారం హైదరాబాద్‌లో అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సేవ విభాగంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు అందించారు. ప్రభావతి, వివిధ సంస్థల వేదికగా, ఆయా ప్రాంతాల్లోని వృద్ధాశ్రమాలు, అనాథాశ్రయాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆకలిని తీర్చే సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నందుకుగాను అవార్డును అందించారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్, ఉమెన్ అండ్ చైల్డ్ సోషల్ సర్వీస్ డైరెక్టర్‌గా చురుకైన పాత్రను పోషిస్తున్న ప్రభా ప్రసాద్‌ను నగర ప్రముఖులు అభినందించారు.

ఊపిరినిచ్చిన వాన

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- నియోజకవర్గంలో సాధారణ విస్తీర్ణం 16,698 హెక్టార్లు



మునగాలలో దుక్కి దున్నుతున్న రైతు

మధురపూడి: వానొచ్చింది... సాగుకు ఊపిరినిచ్చింది.. వేసవి దుక్కుల తర్వాత వర్షాల కోసం ఎదురు చూస్తున్న అన్నదాతల మోములో ఆనందం తెచ్చింది.. ఈ నెల మూడో వారం నుంచే వర్షాలు ప్రారంభం కావడంతో సాగుకు సన్నద్ధత ఆరంభమైంది. గత ఏడాదితో పోల్చుకుంటే ప్రస్తుతం ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. ఇందులో భాగంగా రాజానగరం నియోజకవర్గంలో ఆకుమడులు వేసే పనుల్లో అంతా నిమగ్నమయ్యారు. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 16,698 హెక్టార్లు. నియోజకవర్గంలో వ్యవసాయం అంతా వర్షాధారమే. కొన్ని ప్రాంతాల్లో తొలకరి దుక్కులు జరుగుతుండగా, పలుచోట్ల ఆకుమడి దశలో ఉంది. ఈ ఏడాది రుతు పవనాలు త్వరగా వస్తాయన్న చెప్పడంతో రైతన్నలు సాగుకు ముందుగానే సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. సాగునీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో నారుమడి ఆకు మొలక దశను అధిగమించింది. అయితే రైతన్నలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందక ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్‌లో ప్రధానంగా బీపీటీ 5,204, పీఎల్ఏ 1,100, ఎంటీయూ 1,064, 1,061, ఎంటీయూ 1,318 రకాలను సాగు చేస్తున్నారు.

పెట్టుబడి సాయం.. అందని వైనం

గత ప్రభుత్వంలో రైతుభరోసా కింద రైతన్నలకు సాగులో పెట్టుబడికి రూ.13 వేలు అందించే వారు. తాము అధికారంలోకి వస్తే ఈ సాయం రూ.20 వేలు చేస్తామని ఎన్నికల ముందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏడాది అవుతున్నా ఆ ఊసే లేదని రైతన్నలు నిట్టూర్పు వదులుతున్నారు. ఈ పథకానికి అన్నదాత సుఖీభవ అని పేరు మార్చినా అమలుకు నోచుకోలేదని అంటున్నారు. దీంతో సాగులో పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నకిలీ విత్తనాల జోరు

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్బీకేల ద్వారా విత్తనాలు అందించే ప్రక్రియను పక్కనబెట్టింది. బహిరంగ మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని చెబుతుంది. అయితే బయట మార్కెట్ కల్తీ విత్తనాల జోరందుకుంది. గత రబీ సీజన్‌లో ఓ ప్రముఖ కంపెనీ నుంచి కొనుగోలు చేసిన విత్తనాలు కల్తీవి వచ్చాయని కోరుకొండ మండలం గాదరాడ రైతులు అంటున్నారు. దీనివల్ల నష్టపోవాల్సి వచ్చిందని వాపోతున్నారు.



బూరుగుపూడి వద్ద పుష్కర కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

పిచ్చిమొక్కలు తొలగించక..

నియోజకవర్గంలో పంట భూములకు ప్రధానంగా పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా నీరందుతుంది. దీనికి సంబంధించి కాలువల్లో తూటుకాడ, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వాటిని తొలగించే చర్యలు చేపట్టకపోవడంతో శివారుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. తూటు, పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. నియోజకవర్గంలో చెరువుల నీరు కూడా పంటలకు ఉపయోగపడుతోంది. కోరుకొండ మండలం దోసకాయలపల్లి జగ్గప్పచెరువు, జంభూపట్నం, గాదరాడ, నర్సాపురం, కణుపూరు, నిడిగట్ల తదితర గ్రామాల్లోని చెరువుల నుంచి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

యాజమాన్య పద్ధతులతో మేలు



సాగులో యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రాజానగరం నియోజకవర్గంలో రైతులు సాగుకు సన్నద్ధం కావాలి. దమ్ముల సమయంలో భాస్వరం వేయడం ద్వారా వేరు వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. వర్షాల్లో పంట నేలవాలకుండా నిలబడుతోంది. వ్యవసాయ సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించి ముందుకు సాగాలి.

– టీకే మల్లికార్జునరావు, వ్యవసాయ అధికారి

సాగుకు ఎంతో ఉపయోగం

ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగకరం. వేసవి దుక్కుల తర్వాత చాలా రోజులుగా సాగు ప్రయత్నాలు జరగలేదు. విపరీతమైన ఎండలు ఉండటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం అనుకూల పరిస్థితులతో సాగు సిద్ధమవుతున్నాం.

– దొరబాబు, రైతు, బూరుగుపూడి

సంవిధాన్ హత్యా దివస్ కార్యక్రమం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో సంవిధాన్ హత్యా దివస్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామర్స్ అధ్యాపకులు షేక్ దర్గా మదీనా మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు వీవీ సుబ్బారావు, డాక్టర్ బి.మాధవ్, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులకు సత్కారం



బొబ్బిల్లంక హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు ఎస్.సుందరరావు, సబీనా హుస్సేన్, పీడీ ఎస్.వీరబాబులను ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ అభినందన కార్యక్రమం జరిగింది. పలువురు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాఠశాలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు వి.మేరీ మాత, ఉల్లి రామకృష్ణ, ఎస్.శ్రీనివాసరావు, జేవీ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు

రంగస్థల నటుడు మృతి



సూర్యనారాయణరెడ్డి (ఫైల్)

బిక్కవోలు: కొంకుదురు గ్రామానికి చెందిన సీనియర్ రంగస్థల దర్శకుడు, నటుడు తాడి సూర్యనారాయణరెడ్డి (78) బుధవారం కన్నుమూశారు. అనేక నాటికల్లో నటించడమే కాకుండా, ఎన్నో నాటికలకు దర్శకత్వం వహించిన సూర్యనారాయణరెడ్డి కొంకుదురు వెంకటరమణ ఆర్ట్స్ సంస్థకు ఆస్థాన దర్శకుడిగా ఉంటూనే, సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి నారాయణరావుతో కలసి పని చేశారు. ఆయన మృతికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వెంకటరమణ ఆర్ట్స్ అధినేత చిన్నం వెంకట నారాయణరెడ్డి, సభ్యులు సంతాపం తెలిపారు.

బాలిక సంరక్షణకు చర్యలు

సీతానగరం: స్థానికంగా తిరుగుతున్న ఓ బాలికను సంరక్షణ నిమిత్తం రాజమహేంద్రవరం చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించామని ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బాలిక పసల అర్పణ సీతానగరంలో రెండు రోజులుగా అనుమానాస్పదంగా తిరుగుతుండగా, స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దానితో ఎస్సై రామ్‌కుమార్ ప్రజల సాయంతో ఆ బాలిక వివరాలు సేకరించారు. ఆమె ఇచ్చిన వివరాల ప్రకారం తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రస్తుతం ఆమె సంరక్షణ నిమిత్తం రాజమహేంద్రవరం చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ఎస్సై అప్పగించారు.

పోస్టల్ బీమా చెక్కు అందజేత



ప్రమాద బీమా చెక్కును అసోసియేషన్ సభ్యులకు అందిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ నారాయణ

అనపర్తి: ప్రమాదవశాత్తు మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల పోస్టల్ బీమా పరిహార చెక్కును రాజమహేంద్రవరం వెస్ట్ సబ్ డివిజినల్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.నారాయణ అందజేశారు. బుధవారం పొలమూరులో జరిగిన లైటింగ్, డెకరేషన్, టెంట్ హౌస్, సౌండ్ సిస్టమ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రెండో వార్షికోత్సవంలో ఈ చెక్కును అసోసియేషన్ సభ్యులకు నారాయణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ తపాలా శాఖ ఇండియా పోస్ట్ (ఐపీపీబీ) ద్వారా సామూహిక ప్రమాద బీమా పాలసీ కేవలం రూ.520 ప్రీమియంతో రూ.10 లక్షల బీమా పాలసీని అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా అనపర్తి వీరుళ్లమ్మ లైటింగ్ డెకరేషన్ వారు తమ వద్ద పనిచేస్తున్న కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా పోస్టల్ ప్రమాద బీమా చేయించారన్నారు. బీమా చేయించిన అనంతరం కార్మికుడు సత్తి వీర్రాఘవరెడ్డి విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు గోడ పైనుంచి కిందపడి మరణించారని, ఈ నేపథ్యంలో మంజూరైన పరిహారాన్ని అసోసియేషన్ ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. రాజమహేంద్రవరం ఐపీపీబీ బ్రాంచ్ హెడ్ రాజేంద్రనాయుడు, అనపర్తి సబ్ పోస్ట్‌మాస్టర్ కంభం సుమంత్, వీరుళ్లమ్మ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో సాగు చేపట్టాలి



దొడ్డిగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రంగంపేట: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుని అధిక దిగుబడులు పొందాలని తూర్పుగోదావరి జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం రంగంపేట మండలంలో సార్వా వరి పంటకు నారు మడులు పోస్తున్నారని, పంట ఆరోగ్యం గానే ఉందని, కాండం తొలిచే పురుగు అక్కడక్కడా కనిపిస్తుందని, దీని నివారణకు నారుమడిలో మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఏడు వరి రకాలు రైతుల కమతాలలో మినీ కిట్ పరీక్షకు వచ్చాయన్నారు. మార్టేరు నుంచి ఎంటీయూ 1,443, బాపట్ల నుంచి బీపీటీ 3,284, ఆర్జీఎల్ 7,030, ఆర్జీఎల్ 7,034, ఆర్జీఎల్ 7,038, ఆర్జీఎల్ 7,039, ఆర్జీఎల్ 7,045 అనే నూతన మినీ కిట్ వరి రకాలు పరీక్షకు వచ్చాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి రైతులకు పలు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు, అభ్యుదయ రైతులు తోట సూర్యభాస్కరరావు, దూళ్ల ధర్మరాజు, యలమర్తి శ్రీనివాసరావు, వీఏఏ మహేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

రాజానగరం: మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దిన వారోత్సవాల్లో భాగంగా ఈగల్ క్లబ్, ఎన్ఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఎంచుకున్న లక్ష్యాలను సాధించలేక, సమాజానికి ముఖం చూపలేక, జీవచ్ఛవాలుగా మిగిలిపోతారన్నారు. విద్యార్థి దశను సవ్యంగా వినియోగించుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు సమష్టిగా కృషి చేద్దామని విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా 'సే నో డ్రగ్స్, ఎస్ టూ లైఫ్' అనే అంశంపై చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

నిర్లక్ష్యం ముంచేసింది!

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అభివృద్ధి పనులు చేపట్టడం మంచిదే.. ఈ పనుల సమయంలో ఎవరికీ ఇబ్బంది రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. సరైన ప్రణాళిక లేకుంటే ఇలానే ఉంటోంది. స్థానిక ఐఎల్‌టీడీ జంక్షన్ బొగ్గులదిబ్బ ప్రాంతంలో మున్సిపాలిటీ కల్వర్టు నిర్మాణం చేపట్టింది. దీనివల్ల అక్కడ డ్రైనేజీకి అడ్డుకట్ట వేశారు. వర్షం, ముంపునీరు దిగేందుకు ప్రత్యామ్నాయం చూపలేదు. ఫలితంగా మురుగుతో పాటు వర్షంనీరు కలసి ఐఎల్‌టీడీ నుంచి బాలాజీపేటకు వెళ్లే రోడ్డును ముంచెత్తింది. వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగు, వర్షం నీటితో పాటు దుర్వాసన వస్తుండడంతో వాహనచోదకులు భరించలేకపోతున్నారు. చిరు వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న వీధులు సైతం ముంపునకు గురయ్యాయి. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.



బొగ్గులదిబ్బ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణ పనులు



ముంపునకు గురైన ఐఎల్‌టీడీ రోడ్డు



ఐఎల్‌టీడీ ప్రాంతంలో ముంపునకు గురైన వీధి

జల్‌జీవన్ పనుల పరిశీలన



నాగరత్నం కాలనీలో ఇంటింటి కుళాయిలను పరిశీలిస్తున్న సెంట్రల్ కమిటీ సభ్యులు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలో జల్‌జీవన్ మిషన్‌లో జరిగిన పనులను కేంద్ర ప్రభుత్వ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వ 50 శాతం నిధులతో జల్‌జీవన్ మిషన్‌లో 2023లో పూర్తి చేసిన పనులను వీరు పరిశీలించారు.

ఇందులో కేంద్ర ప్రభుత్వ నుంచి వచ్చిన ముగ్గురు కమిటీ సభ్యులైన మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ గరిమా కపూర్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు టెక్నికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ దామోధర్, సెంట్రల్ వాటర్ కమిషన్ టెక్నికల్ ఆఫీసర్ మన్యూజి ఉపాధ్యాయ ఉన్నారు. తనిఖీలో భాగంగా రూ 20.70 లక్షలతో గ్రామంలో జరిగిన పనులను ట్యాప్ కనెక్షన్లు పరిశీలించి, లబ్ధిదారులు, అలాగే విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. జల్‌జీవన్ మిషన్‌లో వేసిన ఇంటింటి కుళాయిల నుంచి నీరు ఏవిధంగా వస్తుందనేది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ సంగన చినపోశియ్య, పంచాయతీ కార్యదర్శి డి.విజయదుర్గ, వార్డు మెంబర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ గిరి, డీఈఈ రవి కుమార్, ఏఈఈలు వీఎస్ఎస్ ప్రకాష్, వి.అవినాష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత దేశం కోసం కృషి

రాజమహేంద్రవరం రూరల్: డ్రగ్స్ రహిత దేశం కోసం నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారి సీహెచ్ లక్ష్మి అన్నారు. బుధవారం ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ అధ్యక్షతన నశా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ చిన్న వయసులోనే యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుందన్నారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆ బాధితులకు ఆసుపత్రుల్లో కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు మెడికేషన్ అందిస్తారన్నారు. సమావేశంలో సీడీపీఓ నాగలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లీగల్ ఆఫీసర్ గౌరీ, ప్రొటెక్షన్ ఆఫీసర్లు ఆర్.ప్రదీప్, జి.క్రాంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడు అందరివాడు

- భక్తుల చెంతకే భగవంతుడు
- ఇస్కాన్ ఆధ్వర్యంలో రేపు రథయాత్ర
- పులకించనున్న గోదావరి తీరం



ఇస్కాన్ మందిరం



బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వామి విగ్రహాలు

సీటీఆర్ఐ: గోదావరి తీరంలో భక్తుల పూజలు అందుకుంటున్న జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామివారి రథయాత్ర అట్టహాసంగా జరగనుంది. జై జగన్నాథ అంటూ ఆనంద డోలికల్లో భక్తజనం తేలియాడనుంది. ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ శుక్రవారం జగన్నాథ రథయాత్ర నగర పురవీధుల్లో సాగనుంది. ఆ జగన్నాథుడు స్వయంగా రథయాత్రగా జనం మధ్యకు రానున్నారు. ఆ వేడుకను తిలకించే సమయం ఆసన్నమైంది. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. కానీ జగన్నాథ స్వామి రథయాత్రలో మూలవిరాట్‌ను ఊరేగించడం ప్రత్యేకత. మందిరానికి రానివారి కోసం స్వామివారే స్వయంగా బయటకు వచ్చి దర్శనభాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర విశిష్టత. కీర్తనలు, భజనల నడుమ శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్ర విగ్రహాలను ఊరేగిస్తారు.

ఎంతో విశిష్టత..

ఈ రథయాత్రకు రెండు రోజుల ముందు అంటే బుధవారం అమావాస్య, నూతన దేవతామూర్తుల నేత్రోత్సవం జరిగింది. అలాగే వివిధ పూజలు జరిగాయి. గురువారం ప్రజలకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఆషాఢ శుక్ల విదియ శుక్రవారం మేళతాళాలతో ఉదయం పూజలు నిర్వహించి జగన్నాథ స్వామివారి విగ్రహాలను కదిలిస్తారు. ఆనంద బజారు, అరుణస్తంభం మీదుగా స్వామివారిని ఊరేగిస్తారు. ఈ ఉత్సవాన్ని 'పహండీ' అంటారు.

యాత్ర సాగే ప్రాంతాలు ఇవే..

నగరంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహిస్తారు. కీర్తనలు, భజనల నడుమ శ్రీజగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాలను రథంలో ఊరేగిస్తారు. శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి జాగృతి బ్లడ్ బ్యాంకు, దానవాయిపేట, జాంపేట, దేవీచౌక్ అల్లూరి సీతారామరాజు సెంటర్, దేవీచౌక్ లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం సెంటర్, మెయిన్ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ సెంటర్, హెడ్ పోస్టాఫీస్, రైల్వే గూడ్స్ సెంటర్, మహాకాళేశ్వర ఆలయం మీదుగా ఇస్కాన్‌కు చేరుకోవడంతో రథయాత్ర ముగుస్తుంది. రథయాత్ర ముగిశాక జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56 రకాల చప్పన్ భోగ నైవేద్యం, దీపహారతులు, అనంతరం విందు భోజన ప్రసాద వితరణ ఉంటాయి. ఈ వివరాలను బుధవారం ఇస్కాన్ ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు వివరించారు.

2004 నుంచి రథయాత్ర



2004 నుంచి ఇస్కాన్ రథయాత్ర నిర్వహిస్తున్నాం. స్వామివారి రథయాత్ర విశేషం ఏంటంటే ఇక్కడ భగవంతుడి వద్దకు భక్తులు రావడం కాకుండా భక్తుల చెంతకే భగవంతుడు వచ్చి ఆశీస్సులు అందించడం ముఖ్య ఉద్దేశం. పండితులు, పామరులు అని కాకుండా అందరివాడు జగన్నాథుడు అనే నినాదంతో ఈ యాత్ర కొనసాగుతుంది.

– శ్రీమాన్ సత్యగోపీనాథ్ దాస్, ఇస్కాన్ టీఎంసీ అధ్యక్షుడు

పాల్గొని తరించండి



జగన్నాథ రథయాత్రలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందండి. పూరీలో జరిగిన విధంగానే ఇక్కడ కూడా స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. జగన్నాథ, సుభద్ర, బలభద్ర రథయాత్ర అనంతరం ఇస్కాన్‌లో జగన్నాథ స్వామివారికి 56 రకాలతో భోగనైవేద్య కార్యక్రమం కనుల పండువగా జరుగుతుంది.

– శ్రీమాన్ నిమయదాస్, ఇస్కాన్ టీఎంసీ సభ్యుడు